# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 31-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో గనులు, ఎక్సైజ్, పరిశ్రమల శాఖలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు.**

2. **దేశంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు ధీటుగా మంగినపూడి బీచ్ అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**

3. **రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన ప్రోత్సహాకాలను అందిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖమంత్రి ఎస్. సవిత తెలిపారు.**

4. **విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల శాసనమండలి –ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలును విడుదల చేసింది.**

5. **చెట్లను పెంచడంద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించవచ్చని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు డైరక్టర్ జనరల్ రాజేంద్ర చౌధురి పేర్కొన్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో గనులు, ఎక్సైజ్, పరిశ్రమల శాఖలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సమీక్షలో భాగంగా రాష్ట్రంలో గనుల శాఖ ప్రస్తుత పరిస్థితులు, విధివిధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే అక్టోబర్ 1 నుంచి నూతన మద్య విధానం అమల్లోకి రానున్న క్రమంలో ఎక్సైజ్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష జరపనున్నారు. కొత్త మద్యం విధానంపై ఇప్పటికే ఎక్సైజ్‌శాఖ రూపొందించిన ప్రాథమిక ప్రతిపాదనలపై చర్చించనున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలలో పర్యటించనున్నారు. రేపు ఉండవల్లి నివాసం నుంచి బయలు దేరి ఉదయం శ్రీశైలం వెళ్ళనున్నారు. అక్కడ శ్రీశైలం జలాశయాన్ని పరిశీలించి, కృష్ణా నది జల హారతి కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే శ్రీశైలం కుడి జల విద్యుత్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. అనంతరం సత్యసాయి జిల్లాలో మడకశిర గుండుమల గ్రామంలో పింఛన్ల పంపిణీలో భాగంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి ముఖ్యమంత్రి నగదును అందజేయనున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

--------------------------

దేశంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు ధీటుగా కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంత్రి ఈరోజు అధికారులతో కలిసి

బీచ్‌ని పరిశీలించి వసతులు, రక్షణ చర్యలు గురించి పర్యాటకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మంగినపూడి బీచ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భద్రతతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన ప్రోత్సహాకాలను అందిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. నిన్న బెంగుళూరులో పలు వాణిజ్య సంస్థలతో పాటు పారిశ్రామికవేత్తలతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్నివిధాలా సహ కారం అందిస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూమిని సమకూర్చడం, నిబంధనల మేరకు రాయితీలు కల్పించడంతో పాటు అనుమతుల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల శాసనమండలి –ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలును విడుదల చేసిందని కలెక్టర్ ఎం. ఎన్. హరేందిరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి ఎన్నికైన వంశీకృష్ణ పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో గత ప్రభుత్వం అనర్హులుగా ప్రకటించడంతో ఎమ్మెల్సీ ఉపఎన్నికకు ఎన్నికల సంఘం షెడ్యూలు జారీచేసింది. ఆగస్టు 6న ఉపఎన్నిక నోటిఫి కేషన్ విడుదల కానుంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. నామినేషన్ల స్వీకరణకు ఆగస్టు 13వ తేదీ వరకు చివరి తేదీ కాగా, 14న పరిశీలన, ఉపసంహరణకు ఆగస్టు 16న గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించిందని, ఆగస్టు 30న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపఎన్నిక జరగనుందని కలెక్టర్ తెలిపారు.

---------------------------

ఎర్ర కాలువ ముంపు నివారణకు చర్యలు చేపట్టి రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కాపవరం గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న వంతెనను, కాలువ గట్టును మంత్రి నిన్న పరిశీలించి, తక్షణం చేపట్టవలసిన మరమ్మత్తులపై అధికారులతో చర్చించి దిశానిర్దేశం చేశారు. నిడదవోలు నరసాపురం రహదారికి అనుకుని ఉన్న వంతెన శిథిలావస్థకు చేరటంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి తక్షణమే మరమ్మత్తులకు అంచనాల రూపొందించవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఎర్ర కాలువ వరద ముంపు నివారణకు శాశ్వత ప్రాతిపదికన ఆధునీకరణ పనులు చేపట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

చెట్లను పెంచడంద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించవచ్చని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు డైరక్టర్ జనరల్ రాజేంద్ర చౌధురి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజేంద్ర చౌధురి, కళాశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థినుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ

చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణాన్ని – ప్రగతిని సమన్వయం చేసుకునేందుకు తప్పనిసరిగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకుని భావితరాలకు మేలు చేయటమే గాక వారికి ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కడప క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

---------------------------

ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగంలో రేపటి నుండి రాత్రి 8 గంటల 30 నిమిషాలకు 'జాతీయ వార్తలు' పేరిట కొత్త న్యూస్ బులెటిన్ ప్రారంభం అవుతోందని ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి తెలిపారు. ఈ న్యూస్ బులెటిన్ ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగంలో రెండవదిగా పేర్కొన్నారు. ఈ బులెటిన్ రాత్రి ఎనిమిదిన్నర గంటల నుండి ఎనిమిది గంటల నలభై నిముషాల వరకూ ప్రతీ రోజూ ప్రసారం అవుతుందని తెలిపారు. ఇక సాయంత్రం ఆరు గంటల పది నిముషాల నుండి ఆరు గంటల ఇరవై నిముషాల వరకు ప్రసారమయ్యే ప్రాంతీయ వార్తలు యధాతథంగా కొనసాగుతాయని వివరించారు. ఆకాశవాణి శ్రోతలు కొత్త న్యూస్ బులెటిన్‌ని కూడా ఆదరించాలని శ్రీసాయి వెంపాటి కోరారు.

---------------------------

శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల కొనసాగుతోంది.ఎగువనున్న జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 4.02 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరడంతో శ్రీశైలం ప్రాజెక్టు అధికారులు ఏడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 2.05లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 883.5 అడుగులకు చేరిందని. నీటి నిల్వ సామర్థ్యం 207.04 టీఎంసీలుగా ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, జలియన్ వాలా బాగ్ హత్యాకాండకు సూత్రధారి జనరల్ మైకేల్ డయ్యర్‌ను హతమార్చిన ఉద్ధం సింగ్ వర్ధంతి ఈరోజు. ఈ సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళు లర్పిస్తున్నారు. 1899 డిసెంబర్ 26వ తేదీన పంజాబ్ రాష్ట్రంలోని సునాం గ్రామంలో జన్మించిన ఆయన... దేశ భక్తికి, త్యాగానికి మరో పేరుగా నిలిచారు. స్వాతంత్ర్య సాధన కోసం ప్రముఖ విప్లవ వీరుడు భగత్ సింగ్తో కలిసి అనేక విప్లవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డయ్యర్‌ను హతమార్చినందుకు ఉద్దం సింగ్‌ను 1940 జూలై 31వ తేదీన బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు...

---------------------------

కేరళలోని వయనాడ్ జిల్లాలో భారీ వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 120 కు పెరిగింది. మృతుల్లో 34 మందిని గుర్తించామని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్

తెలిపారు. వయనాడ్ జిల్లాలోని మెప్పాడి ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడటంతో వందల సంఖ్యలో గృహాలు ధ్వంసమయ్యాయి. ఆర్మీ, విపత్తు నిర్వహణ దళాల సహాయక చర్యల్లో భాగంగా 400 మందిని రక్షించారు. మరోవైపు, వయనాడ్ విపత్తు నేపథ్యంలో కేరళ ప్రభుత్వం రెండు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనతో మాట్లాడారనీ అన్ని విధాలా సాయం అందిస్తామన్నారని ముఖ్యమంత్రి విజయన్ తెలిపారు.

---------------------------

అమృత్ భారత్ పథకం కింద శ్రీకాళహస్తి స్టేషన్ ను అభివృద్ధి చేసేందుకు 11 కోట్ల 75 లక్షల రూపాయలను బడ్జెట్ లో కేటాయించారని శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ మేనేజర్ వి.మన్మోహన్ కృష్ణ తెలిపారు. ఈ రోజు ఆయన శ్రీకాళహస్తిలో మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న పలు రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తోందని, ఈ పథకం కింద తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ ఎంపికైందన్నారు.

======================